

## వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

27వ వివాహ దినోత్సవాన్ని
జరుపుకుంటున్న
**కట్ల శ్రీనివాస్-రమాదేవి**
దంపతులకు
పెళ్లి రోజు శుభాకాంక్షలు

**TBA**
**మిత్ర బృందం**



# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

*Evening Daily*

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 282 | బుధవారం | 22 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# చెరువుల చెర వీడనుందా..?






- తెరపైకి లేక్ ప్రొటెక్షన్, రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్
- గైడ్ లైన్స్ తయారు చేస్తున్న మునిసిపల్ శాఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు
- పదేళ్లుగా పట్టించుకోని పాలకులు
- ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పాలన గాడిన పడుతోంది. ఇంతకాలం రాజకీయ అండదండలతో చెరువులు, కుంటలను ఆక్రమించి కోట్లకు పడగలెత్తిన వారిపై కొరడా ఝులిపించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. పట్టణ ప్రాంతంలో గతంలో ఉన్న లేక్ ప్రొటెక్షన్ కమిటీ స్థానంలో తెరపైకి లేక్ ప్రొటెక్షన్, రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్‌ను తీసుకొస్తున్నారు. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకొని సీడీఎంఏ (కమిషనర్ ఫర్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) గైడ్ లైన్స్ తయారు చేస్తోంది. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా నగర పరిధిలోని జల వనరులను సంరక్షించే బాధ్యతను ఆయా మునిసిపాలిటీలకు కట్టబెట్టనున్నారు. ఇకనుంచి ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురైతే అందుకు కమిషనర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెస్తున్న లేక్ ప్రొటెక్షన్, రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్ పై పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనితో చెరువుల చెర వీడుతుందంటున్నారు.

- వరంగల్ వాయిస్, వారంగల్


వివరాలు 2లో..


## రోడ్డుపైనే షెడ్డు..

**మామూళ్ల మత్తులో బల్దియా అధికారులు**






హనుమకొండ నయింనగర్ రోడ్, కిషన్ పుర గురుద్వార్ కాలనీకి చెందిన రోడ్డును ఇమ్మని వేణుగోపాల్ రెడ్డి ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించినా బల్దియా అధికారులు చోద్యం చూడడంపై స్థానికులు మండిపడుతున్నారు. డాక్టర్ శనిగరం తిరుపతయ్యకు చెందిన భవనాన్ని అద్దెకు తీసుకున్న వేణుగోపాల్ రెడ్డి అందులో బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తూ కాలనీ వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండే రహదారిపైనే రేకుల షెడ్డు నిర్మించి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నా ఈ ప్రాంతానికి చెందిన బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ గాని, ఇతర మునిసిపల్ అధికారులు కాని మామూళ్లకు ఆశపడి షెడ్డును తొలగించడంలేదన్న ఆరోపణలున్నాయి.

- వరంగల్ వాయిస్, హనుమకొండ


8లో




## ఆలోచించండి.. రాకేష్ రెడ్డికి అండగా నిలువండి

- అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్
- నమ్మి మోసపోయిన జనం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# చెరువుల చెర వీడనుందా..?


వడ్డేపల్లి చెరువు

**తెరపైకి లేక్ ప్రొటెక్షన్, రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్**

**గైడ్ లైన్స్ తయారు చేస్తున్న మునిసిపల్ శాఖ**

**హర్షం వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు**

**పదేళ్లుగా పట్టించుకోని పాలకులు**

**ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు**

**వరంగల్ వాయిస్, వారంగల్ :** చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉంది గ్రేటర్ వరంగల్ అధికారుల పనితీరు. నగర పరిధిలోని అనేక చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నాయి. ఇప్పటికే వందలాది ఎకరాలను ప్లాట్లుగా చేసి విక్రయించారు. దీంతో చెరువుల్లోనే పెద్ద పెద్ద భవంతులు వెలిశాయి. వాటికి బల్దియా అధికారులే ఇంటి నెంబర్లు కేటాయించడం గమనార్హం. ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. రాజకీయ నేతల ఒత్తిడితో పట్టణ ప్రాంతాల్లో కబ్జాకు గురైన చెరువులు, కుంటల చెర విడిపించేందుకు మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో కసరత్తు చేస్తోంది.

## రాజకీయ ఒత్తిడిలే కారణం..

గతంలో పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను పరిరక్షించే బాధ్యత ఆయా మునిసిపాలిటీలే నిర్వహించేవి. ఇందుకు గాను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పేరుతో కమిషనర్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసేవారు. ఇందులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పర్యావరణ ప్రేమికులు, ఇతల అధికులు కమిటీ సభ్యులుగా ఉండేవారు. చివరిసారిగా హనుమకొండలోని కుడా కార్యాలయంలో అప్పటి మునిసిపల్ కమిషనర్ అధ్యక్షతన 18 జూలై 2020లో లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం రాజకీయ నాయకుల ఒత్తిడితో లేక్ ప్రొటెక్షన్ కమిటీని అటకెక్కించారు. అయితే ఈ కమిటీని పునరుద్ధరించి నగరంలో ఆక్రమణలకు గురవుతున్న చెరువులను పరిరక్షించాలంటూ పర్యావరణ ప్రేమికులు పలుమార్లు కమిషనర్, కలెక్టర్ కు విన్నవించుకున్నా ప్రయోజనం చేకూరలేదు.



## తెరపైకి లేక్ ప్రొటెక్షన్ కమిటీ..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటి వనరులను సంరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. ఇందులో భాగంగా సీడీఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో హైదరాబాదులోని తాజ్ కృష్ణ హొటల్లో 'లేక్ ప్రొటెక్షన్ అండ్ రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్ షాప్ లో గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న నిపుణుల సలహాలు, సూచనలతో గైడ్ లైన్స్ తయారు చేసేందుకు మునిసిపల్ శాఖ సిద్ధపడింది. ఇట్టి కార్యాచరణ అమలు కోసం ఆయా మునిసిపాలిటీలు ప్రత్యేక శ్రద్ధ వహించి జల వనరులను సంరక్షించాలని ఆదేశించింది. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

## కబ్జాకు గురైన చెరువులు..

వరంగల్ నగరంలో అతి కీలకమైన భద్రకాళి చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. సర్వే నెంబర్ 849/బి1లో చెరువు విస్తీర్ణం 386.33 ఎకరాలు ఉండగా అందులో 50 నుంచి 60 ఎకరాల వరకు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికీ కొంతమంది కబ్జా కోరులు చెరువును ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. చెరువులోనే భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. హనుమకొండ న్యూశాయంపేటలో 150 ఎకరాల్లో విస్తరించి ఉన్న కోమటి చెరువులో సుమారు 15-20 ఎకరాలు కబ్జా పాలైంది. కాజీపేట బంధం చెరువు 57 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ఇప్పుడు నగమే మిగిలింది. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నా కార్పొరేషన్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయిస్తూ కబ్జా దారులకు సహకరిస్తున్నారు. 324 ఎకరాల్లో విస్తరించిన హన్మకొండ వడ్డేపల్లి చెరువులో సుమారు 40 ఎకరాల స్థలం అన్యాక్రాంతమైంది. 21.24 ఎకరాల్లో ఉన్న గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులో ఎనిమిది ఎకరాల దాకా ఆక్రమణల పాలైంది. 157 ఎకరాలున్న హసన్ పర్తి పెద్దచెరువులో కొందరు పట్టాభూమి పేరుతో చెరువు పరిధిలోని 30 ఎకరాలను ఆక్రమించుకున్నారు. 159 ఎకరాల విస్తీర్ణం కలిగిన ములుగు రోడ్ లోని కోట చెరువులో సుమారు 30 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు రెవెన్యూ శాఖ తేల్చింది. 100 ఎకరాలున్న చిన్న వడ్డేపల్లి చెరువులో 20 ఎకరాల్లో ఆక్రమణలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 170 ఎకరాల మామునూరు పెద్ద చెరువులో 40 ఎకరాలు ప్రైవేటు చెరలోనే ఉంది. ఉర్సు రంగసముద్రం (ఉర్సు చెరువు) 126 ఎకరాల్లో ఉండగా.. సుమారు 26 ఎకరాల వరకు అన్యాక్రాంతమైంది. అమ్మవారిపేట దామెర చెరువు విస్తీర్ణం 134 ఎకరాలు కాగా, ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. సుమారు 20 ఎకరాల వరకు మాయమైంది. తిమ్మాపూర్ శివారు బెస్తం చెరువును స్మృతి వనంగా మార్చే ప్రతిపాదన ఉంది. 6 ఎకరాల విస్తీర్ణం ఉండే ఈ చెరువులో... సగం దాకా ఆక్రమణలోనే ఉంది.


రంగసముద్రం


బెస్తం చెరువు

# సైలెన్సర్లు మార్పు చేస్తే.. క్రిమినల్ కేసులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఇష్టానుసారం మార్పు చేస్తే వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్ పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం సీపీఓ జంక్షన్ వద్ద అధిక శబ్ధం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ తో ధ్వంసం చేశారు. గత కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనీఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుంచి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. తొలగించిన 261కు పైగా సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 73 కాగా కాజీపేట 88, వరంగల్ 100 ఉన్నాయి. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలన్నారు. సైలెన్సర్ మార్పు చేసే వారిపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకుంటారన్నారు. వారి వాహన లైసెన్స్ మూడు నెలలు రద్దు చేయడంతోపాటు అట్టి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.మెకానికులు సైతం సైలెన్సర్ల మార్పును ప్రోత్సహించరాదన్నారు. ఈ కార్యక్రమములో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు శ్రీధర్, షుకూర్, నాగబాబుతో పాటు ట్రాఫిక్ ఎస్సైలు పూర్ణ చంద్ర రెడ్డి, యుగంధర్ ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# హంస వాహనంపై.. హనుమాన్ నగర సంకీర్తన



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రంగశాయిపేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ ఆంజనేయ స్వామి మాల ధారులు శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని హంస వాహనంపై (పల్లకి సేవ) నగర సంకీర్త నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో రంగశాయిపేట గ్రామ పురవీధుల గుండా పురాతన దేవాలయాలను అన్నింటిని చుట్టి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ వాస్తవ్యులైన పిట్టంపల్లి రామలింగాచారి శ్రీ అయోధ్య బాల రాముల వారి కోసం సొంతంగా తయారు చేసిన పంచలోహ పాదుకలను పల్లకిలో ఉంచి గ్రామ ప్రజల సందర్శన చేయించారు. పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో నగర సంకీర్తనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి నాయకులు బొలుగొడ్డు సారయ్య, లక్కాకుల రాహుల్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డిపై తప్పుడు కేసులను ఎత్తివేయాలి

## పీడీఎస్‌యూ విద్యార్థి నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ రెడ్డి తదితరులపై బనాయించిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే వెనుకకు తీసుకోవాలని బుధవారం పీడీఎస్ యూ నగర కార్యవర్గం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పీడీఎస్ యూ నగర కార్యవర్గం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ రెడ్డిపై ఇల్లందు పోలీసులు పూసపల్లి కుట్రకేసు మోపడాన్ని ఖండించి తక్షణమే కేసులను వెనుకకు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల పైన మోపిన తప్పుడు కేసులను మొత్తం ఎత్తివేస్తామన్నారు. కానీ, దానికి విరుద్ధంగా ఈరోజు విద్యార్థులు, విద్యార్థి నాయకులపైన తప్పుడు కేసులు బనాయించి అనేక ఇబ్బందుల గురి చేయడం సరికాదన్నారు. 1974లో ఏర్పడిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యూ దేశంలో శాస్త్రీయ విద్యా విధానం రూపొందించాలని కామన్ విద్యా విధానం కోసం పోరాడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అందరికీ అందుబాటులో ఉంటూ విద్యార్థుల కోసం అనేక పోరాటాలు చేసింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ హాస్టల్ సమస్యలపై, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ రద్దు కోసం ఉద్యమించిందన్నారు. పాఠశాల స్థాయి నుంచివిశ్వవిద్యాలయాల స్థాయి వరకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా విధానాన్ని నియంత్రించాలని విద్యార్థుల ఆత్మహత్యలు వ్యతిరేకంగా కేంద్రం తీసుకువచ్చిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20-20 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పట్ల విద్యార్థుల పక్షాన నిలబడి నిస్వార్థంగా పనిచేస్తుందని, అలాంటి విద్యా సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీ బిల్లుకు, అనేక విద్యార్థి సమస్యల పైన పోరాటాలు నిర్వహించి విద్యార్థులపై తరపున పోరాడుతున్న ఎం.వెంకట్ రెడ్డి పైన కావాలని పూసపల్లి కుట్ర కేసు చేర్చడం సరిది కాదన్నారు. తక్షణమే తప్పుడు కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు గణేష్, అర్జున్, ముష్రాఫ్, ప్రణయ్, అక్రమ్ పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఝాల్లి కాలనీ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల ఎంపీడీఓ బి.గోవిందరావు సందర్శించారు. ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఎంపీడీఓ క్షుణ్ణంగా పరిశీలించారు. పనులలో నాణ్యతను పెంచాలని తెలిపారు. ఈ పనులను త్వరితగతిగా జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు. టాయిలెట్స్, కరెంట్ పనులను పరిశీలించి వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆఫీస్ సుపర్ డెంట్ బి.దయాకర్, పాఠశాల ఇంచార్జి హెడ్మాస్టర్ ఏ.మాధురి, వీఓ ఎం.కోమల, సీఆర్పీ సంపత్, మెసెంజర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 21వ డివిజన్‌లో వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు కొండా దంపతుల ఆదేశాల మేరకు 21వ డివిజన్‌లో పట్టభద్రులైన ఓటర్ ఇంటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్ మహాశయులను కోరారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ముల సందీప్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటల రాజు, మాజీ కౌన్సిలర్ దూపం సంపత్, కాంగ్రెస్ నాయకులు మారేడు నరసయ్య, వెల్దండి లక్ష్మణ్, బోట్ల సదానందం, లక్కిరెడ్డి పూర్ణంధర్ రెడ్డి, సుందరగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజును కలిసిన సారంగపాణి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** కాంగ్రెస్ పార్టీ మత్స్య విభాగం వరంగల్ జిల్లా చైర్మన్ గుడిబోయిన సారంగపాణి బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిశారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ మత్స్య విభాగం వరంగల్ జిల్లా చైర్మన్‌గా వర్ధన్నపేట పట్టణానికి చెందిన గుడిబోయిన సారంగపాణి నియమితులైన సందర్భంగా బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు సారంగపాణికి అభినందనలు తెలిపి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం సారంగపాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మత్స్య విభాగం జిల్లా చైర్మన్ గా నియామకమైన తనకు ఎమ్మెల్యే నాగరాజు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

## ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలో యతీ రాజారావు పార్క్ లో బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఉదయం వాకింగ్ చేస్తూ పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. వారి వెంట పట్టణ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## తీన్మార్ మల్లన్నకు మద్దతుగా ఇనగాల ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను అధిక మెజారిటీతో గెలిపించాలని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కోరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశానుసారం బుధవారం గీసుగొండ మండలం, 15,16వ డివిజన్ల పరిధిలోని మండల డివిజన్ల స్థాయి సన్నాహక సమావేశాన్ని మరియాపురం గ్రామంలోని నక్షత్ర ఫంక్షన్ హాల్ లో, సంగెం మండలం 17వ డివిజన్ స్థాయి సమావేశాన్ని సంగెం మండల కేంద్రంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల నియోజకవర్గ ఇంచార్జి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ వొడితల ప్రణవ్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల పట్టణ డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సమన్వయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## నాగులమ్మ దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొయ్యూరు అటవీ ప్రాంతంలో కొలువైన నాగులమ్మ దేవాలయాన్ని బుధవారం రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సందర్శించి నాగులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు సక్రమంగా కురిసి రైతులు, ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజి రెడ్డి, నాయకులు రాజయ్య, కొండ రాజమ్మ, కొండూరి మమత, లకావత్ సవెందర్, ఇరుకు పోచయ్య, గడ్డం క్రాంతి, అయిత సమ్మి రెడ్డి, కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ సమాజం, మేధావులు ఆలోచించి ఓటు వేయాలని, చట్టసభల్లో నిజాయితీతో కూడిన తెలంగాణ గళం వినిపించాలంటే.. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన బిడ్డ, బిట్స్ పిలానీలో చదివిన విద్యాధికుడైన ఏనుగుల రాకేశ్ రెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భాగంగా హనుమకొండలోని వారి నివాసంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్, ఎంపీ అభ్యర్థి మారేపెల్లి సుధీర్ కుమార్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న 15 వేల పట్టభద్రులను బీఆర్ఎస్ శ్రేణులు వారిని ప్రత్యక్షంగా కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గమనించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ బోగస్ హామీలను, మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి క్లష్టర్ లో ఉన్న గ్రామాలకు ఆ గ్రామాల్లో ఉన్న వారిని బాధ్యులను చేస్తూ ఇంచార్జిలను నియమించాలన్నారు. ప్రతి ఓటరును కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన పనిలేదన్నారు.

# కళాశాల గ్రౌండ్ దురాక్రమణపై న్యాయ విచారణ జరిపించాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్




**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ దురాక్రమణపై న్యాయ విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ మండల సమితి సమావేశం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా నాయకుడు సీపతి వినయ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ హాజరై మాట్లాడుతూ ధర్మసాగర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఉన్న గ్రౌండ్ భూమిని కొంతమంది వ్యక్తులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం కబ్జా చేశారన్నారు. దీనివల్ల కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి ఆటంకంగా మారిందని, దీనిలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి తగు న్యాయ విచారణ చేసి జూనియర్ కళాశాల భూమిని రికవరీ చేసి ప్రహరీ గోడ నిర్మించాలని, భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, మండల నాయకులు వంశీ, చందు, రాజు, శేఖర్ అనిల్, సునీల్, మహేష్, అర్జున్ శ్రీను, చందు, సన్నీ, అంజితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ భూమిపై ఉన్న సమస్త జీవరాసులను, వృక్ష సంపదను, జల వనరులను, ప్రకృతిని సంరక్షించి కాపాడుకోవడం రాబోవు తరాల వారికి మన అందించే విలువైన బహుమతి అని, వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రముఖ సామాజికవేత్త, వన సేవ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. "అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం "సందర్భంగా బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ధరిత్రిపై ఉండే జీవరాశుల వలన జీవ సమతుల్యం ఏర్పడుతుందని, వీటిలో ఏ జీవి మనుగడకైనా నష్టం వాటిల్లితే అది మిగిలిన జీవరాశులపై ప్రభావం చూపి జీవవైవిద్యానికి విఘాతం కలిగిస్తుందని అన్నారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే ఈ విషయాలపై ఆసక్తి పెంచడానికి వారి పాఠ్యాంశాలలో భాగంగా "ఎన్విరాన్ మెంటల్ సైన్స్"(ఈవీఎస్) అనే సబ్జెక్టును ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు విషయాలను బోధించి వారిని ప్రకృతి ప్రేమికులుగా మార్చాలని ఆయన కోరారు.

# తరుగు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

## ధాన్యం మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** రైతుల నుంచి ఎలాంటి తరుగు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం వెంకటాపుర్ మండలం లింగాపూర్ గ్రామ సమీపంలోని ఆదిత్య ఆగ్రో ఇండస్ట్రీ ధాన్యం మిల్లును జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిల్లులోని ధాన్యం దిగుమతులు ఎగుమతులు సంబంధించిన రికార్డ్స్ పరిశీలించి మిల్లింగ్ ప్రక్రియ జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మిల్లుకు వచ్చే ధాన్యం త్వరగా దిగుమతి చేసుకోవాలని, ఎలాంటి తరుగు విధించకుండా, రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని, రైతులకు ఇబ్బందులు గురి చేసినా, నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యానికి సంబంధించి ట్రక్ షీట్స్ ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. మిల్లు యాజమాన్యం రైతులకు కట్టింగ్ తో దిగుమతి చేసుకుంటున్నారా, ఇతర ఇబ్బందులకు గురి చేస్తున్నారా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా మిల్లు నుంచి రైతులతో ఫోన్ లో సంభాషించి అన్ని వివరాలు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ బి.రాంపతి, డీసీఓ సర్దార్ సింగ్, గోవిందరావుపేట తహశీల్దారు సుజన్ కుమార్, ఎంపీడీవో, ఎంపీఓ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నల్గొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఉపఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్రఅధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు పట్టబద్రులైన ఓటర్లకు పిలుపునిచ్చారు. బీసీ హక్కుల సాధన సమితి ఈ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్ )కు సంపూర్ణ మద్దతును ప్రకటించిందన్నారు. గత పదేళ్లుగా పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరుసలిపి ప్రజా సమస్యలపై ముఖ్యంగా బీసీల, బడుగు, బలహీన వర్గాల, విద్యార్థి, యువజన, మహిళల, మైనారిటీల, అన్నివర్గాల ప్రజల సమస్యలపై పోరాడే, ప్రశ్నించే ప్రజా గొంతుకగా నిలుస్తున్న తీన్మార్ మల్లన్న శాసనమండలిలో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజంలో వివిధ వర్గాలకు జరుగుతున్నఅన్యాయాలపై, అక్రమాలపై శాసనమండలిలో గొంతెత్తి ప్రజావాణిని నిర్భయంగా వినిపించగలిగే మల్లన్నను గెలిపించేందుకు బీసీ, ఉద్యోగ, కార్మిక విద్యార్థి, యువజన, మహిళ, మైనార్టీ ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు ఆయా జిల్లాలలో అంకితభావంతో కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత విద్యావంతులైన ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఈనెల 27న తమఅమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును తీన్మార్ మల్లన్నకు వేసి గెలిపించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీగా గుజ్జులను గెలిపించండి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని పెంచికలపేట గ్రామంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం బీజేపీ నాయకులు పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటెయ్యాలని, ప్రతిపక్ష నాయకుడు, నీతి నిజాయితీగల నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. పార్టీలు మారని వ్యక్తి ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలిలో పట్టభద్రుల, నిరుద్యోగ సమస్యలపై పాలక పక్షాన్ని నిలదీసేందుకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బలవంతుల రాజు, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, మండల కార్యదర్శులు భయ్యా పైడి, అల్లి మహేందర్, బీసీ సెల్ మండల కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కొలగాని సుధాకర్ పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకు ఓటు వేయాలి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని ఎమ్మెల్సీ పట్టభద్రులు తమ ఓట్లను ప్రశ్నించే గొంతుకకుకు వేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డినికి మద్ధతుగా మీ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్ధించారు. మండల సీనియర్ నాయకులు ఇంటింటికి తిరిగి బీఆర్ఎష్ అభ్యర్థికి ఓట్లు వేయాలని అడిగారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొడ్డు ప్రభుదాస్, మహమ్మద్ లాల్, బండ విజయపాల్ రెడ్డి, దంతూరి బాలరాజు, శాతబోయిన రమేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈనెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్ -ఖమ్మం-నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నకు మద్దతుగా పరకాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని రెండోవార్డ్ 56వ బూత్ లో పట్టభద్రులైన గ్రాడ్యుయేట్స్ దగ్గరికి వెళ్లి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత (మొదటి)ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే తత్వం ఉన్న వ్యక్తి తీన్మార్ మల్లన్న అని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వ అరాచకాలను ఎండగడుతూ ప్రజల ముందుంచారని గుర్తు చేశారు. ఒక జర్నలిస్టుగా పోరాడిన తీన్మార్ మల్లన్నను గుర్తించి కాంగ్రెస్ పార్టీ బరిలో దింపడం జరిగిందని, ఆయనకు గ్రాడ్యుయేట్స్ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, ఉమ్మడి పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ పట్టణ నాయకులు బొచ్చు కట్టయ్య, బోచ్చు జితేందర్, ఒంటేరు సదానందం, జూపాక కిషన్, ఒంటేరు విజయ్, మంద శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీదేవి, భూదేవి కళ్యాణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ మత్స్యగిరి స్వామి శ్రీదేవి భూదేవి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు తమ ఇంటి నుంచి పట్టు వస్త్రాలను తలంబ్రాలను మంగళ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వేదమంత్రాల మధ్య దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, యాగ్నీకులు వీరవెల్లి వేణుగోపాల చారి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీ మత్స్యగిరి స్వామి వారికి జిన్నా కృపాకర్ రెడ్డి రేఖా దంపతులు దంపతులు రథం నూతనంగా నిర్మించి పూజా కార్యక్రమాలు నిర్వహించి దేవాలయానికి అప్పగించారు. కళ్యాణం అనంతరం దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి రాజమణి దంపతులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, కృపాకర్ రెడ్డి, అడ్వకేట్ లెక్కల జలంధర్ రెడ్డి, గన్ను వేణుగోపాల్, కంబత్తుల ప్రకాష్, పన్నాటి ప్రకాష్, మామిడి రాజు, దిడ్డి ప్రభాకర్, గొల్లపల్లి సదానందం, రామ్ గోపాల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆహార పదార్థాలలో కల్తీని అరికట్టాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆహార పదార్థాలలో కల్తీని అరికట్టాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డా.పల్లె పాడు దామోదర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ కోఠిలో రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్ విజయ కుమార్ ను కలిసి, ఆహార కల్తీ నిరోధానికి సంబంధించిన వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం ఆహార కల్తీ సమస్యలుకొనసా గుతూనే ఉన్నాయని, ప్రతీ చోట టాస్క్ ఫోర్స్ దాడుల్లో భయంకర ఆహార కల్తీ సంఘటనలు వెలుగులోకి వస్తున్న క్రమంలో ఆహార కల్తీ నిరోధానికి వినియోగదారుల సంఘాలతో కలిసి జిల్లా స్థాయిల్లో ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేయాలని డా. పల్లె పాడు దామోదర్ పాటు సీసీఐ. జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియాలు డిప్యూటీ కంట్రోలర్ విజయ కుమార్ ను కోరారు. 24 గంటల వరకే నాణ్యతగా ఉండే పాలను, రెండు లేదా మూడు రోజులు వరకు పాలు నాణ్యతగా ఉండటానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాలు కలపడం సర్వ సాధారణమైపోయిందని, పసుపులో లెడ్ క్రోమేట్ కలపడం వల్ల క్యాన్సర్ వ్యాధులు విజృంభిస్తున్నాయని కాబట్టి వినియోగదారుల్లో ఆహార కల్తీ పట్ల చైతన్యం కూడా నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని, వినియోగదారుల ప్రతినిధులు విన్నవించారు. హైద రాబాద్ హెూటల్స్ కల్తీ అరికట్టే బాధ్యత ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ ఫుడ్ ఇన్ స్పెక్టర్ లను అప్రమత్తం చేయాలని, డిప్యూటీ కంట్రోలర్ ను కోరడం జరిగింది.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మునుకుంట్ల రవి కుటుంబానికి 2002-03 పదవ తరగతి మిత్ర బృందం బాసటగా నిలిచింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఏదైనా అవసరం ఉన్న అండగా ఉంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆ కుటుంబానికి మనోధైర్యం అందించారు. తమలో ఒకరైన మునుకుంట్ల రవిని రోడ్డు ప్రమాదంలో కోల్పోవడం తీరని లోటని, రవి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

## బీఆర్ఎస్ పార్టీ బైక్ ర్యాలీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నల్గొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కోరుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని నాని గార్డెన్ లో జరిగిన సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విచ్చేస్తున్నందున 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఓటు హక్కు కలిగిన పట్టబద్రులు సైకిల్ మోటార్లతో ఊరేగింపుతో నాని గార్డెన్ చేరుకున్నారు. ఈ ఊరేగింపులో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు కోరే కృష్ణ, మరుపల్ల గౌతమ్, సాదుల రంజిత్, కళ్యాణపు వెంకటేశ్వర్లు, గజ్జి సాంబయ్య, చీర రమేష్, ఎండీ ఫరీద్, శెట్టి మోహన్, భౌరిశెట్టి సదానందం ఉన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్ లోని అబ్బని కుంట, యాకూబ్ పురా, దయానంద కాలనీలో గ్రాడ్యుయేట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న రెండో నెంబర్ బ్యాలెట్ లో ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ గ్రాడ్యుయేట్లను కోరారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నను గతంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెట్టినా, అనేక కేసులు బనాయించి జైలు పాలు చేసినా అనేక కేసీఆర్ ప్రభుత్వం స్కాములు బయటపెట్టిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గూడ శారద, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ రమ్య, కాంగ్రెస్ నాయకులు సర్దార్ జస్వీర్ సింగ్, గుండం సురేందర్, షేక్ ఇస్మాయిల్, దౌడు నాగరాజ్, గూడ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



### 21 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

### చిన్ననాటి సంగతులను పంచుకున్న 2002-03 బ్యాచ్

### ఒకరికొకరం.. ఆపదలో తోడుగా ఉంటాం అందరం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ కలిసిమెలసి గడిపిన తమ బాల్య స్మృతులను 21 ఏళ్ల తర్వాత కలిసిన జడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. సంతోషంలో దుఖంలో అంతా ఒక్కటై ఒకరికి..ఒకరం తొడుంటామని ఉమ్మడిగా భరోసాను కల్పించుకున్నారు. ఇదంతా ఈనెల 19న కమలాపూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2002-03 బ్యాచ్ గర్ల్స్ అండ్ బాయ్స్ కార్యక్రమంలో విద్యార్థులు తమ చిన్ననాటి సంగతులను గుర్తుకు చేసుకుంటూ చేసుకున్న బాసలు. చిన్ననాటి మిత్రులంతా 21 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి సంతోషం అంబరాన్నింటింది. అలాగే తమకు విద్యాదానం చేసిన గురువులను ఆహ్వానించి సత్కారాలు, బహుమతులు ప్రదానం చేసి వారిని ఘనంగా సన్మానించారు. ముందుగా అకాల మరణంతో తమకు దూరమైన తమ మిత్రులు, గురువులకు శ్రద్ధాంజలి ఘటించి ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం బాల్యంలో తమ తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ ఆప్యాయతలు, అనురాగాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ ప్రిన్సిపల్ రామ కృష్ణం రాజు, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపల్ మల్లికార్జున్ రావు పాల్గొన్నారు. డాన్స్ మాస్టర్ అర్జున్ టీం తమ డాన్స్ పోగ్రాంతో పూర్వ విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గురువులు, పూర్వ విద్యార్థులకు విందు భోజనం పెట్టిన పల్లపు సురేష్ కు ధన్యవాదాలు తెలియజేశారు. తమ బ్యాచ్ లోని పూర్వ విద్యార్థులకు ఆపద సమయాల్లో ఒకరికి ఒకరూ సహాయ సహకారాలు అందజేసుకుంటామని ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అలనాటి గురువులు మల్లయ్య, నారాయణ, నవీన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజమౌళి, హెడ్ వర్డ్, తిరుపతి, రాజేందర్, విజయ్ చందర్, నర్సింగ రావు, శ్రీనివాస రావు, పద్మ, వనజ, శ్రీదేవి, సురంభ, సూర్య భవాని, స్నేహలత, వెంకటరమణ, నీత, సుజాత, రవీంద్రనాథ్, అనిల్, నర్సింగ రావు (రిటైర్డ్ హెడ్ మాస్టర్) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆర్గనైజర్ టీం పుల్ల రమేష్, చిరంజీవి, విశ్వనాథ్, పుల్ల రాజేష్, శ్రీకాంత్, అశోక్, ఉమాదేవి, కరుణాదేవి, స్వామి, మధుకర్, విక్రమ్, సుమన్, సంపత్, శ్రీను, శ్రీలత, కరుణాదేవి, నర్మద, స్రవంతి, ఉమాదేవి పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా రాకేష్ రెడ్డిని గెలిపించాలి

### పిలుపునిచ్చిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేశ్ రెడ్డిని గెలిపించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఉన్నత విద్యావంతులు, యువకులు, నిజాయితీపరులు రాజకీయాల్లోకి రావాలని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఒక వ్యాపారం చెడిపోతే ఆ వ్యాపారి మాత్రమే నష్టపోతారు. ఒక వ్యక్తి ఆరోగ్యం చెడిపోతే ఆ శరీరానికి మాత్రమే నష్టం కానీ, రాజకీయాల్లో చెడు వ్యక్తులు, స్వార్థ పరులు, మోసగాళ్లు ఉంటే మాత్రం మొత్తం సమాజమే చెడిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, ఉన్నత విద్యావంతులు, నిజాయితీపరులు, ప్రజాసేవ పట్ల అంకితభావం గల యువత రాజకీయాల్లోకి రావాలి రాణించాలి అని తపనపడే వారిలో నేనూ ఒకరిని అన్నారు. అందరికి సుపరిచితుడు, మిత్రుడు రాకేష్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరుతూ వీడియో విడుదల చేశారు. ఈ నెల 27 జరిగే ఎన్నికల్లో సీరియల్ నెంబర్ 3పై గల ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి భవిష్యత్ నాయకుడిని కాపాడుకోవాలన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ లో సుర విజయ్ కుమార్ వెంకట్రామ జంక్షన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ కు తన మోటార్ సైకిల్ పై వెళుతుండగా వరంగల్ రైల్వేస్టేషన్ దగ్గర డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా, అతడు మద్యం సేవించి ఉన్నాడు. మొహమ్మద్ ఖాజా పాషా, సాయంత్రం తన మోటార్ సైకిల్ పై కాశిబుగ్గ నుంచి పోచంమైదాన్ వస్తుండగా, పోచంమైదాన్ జంక్షన్ దగ్గర డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా ఇతడు మద్యం సేవించి ఉన్నాడు. ఏండ్ల రవీందర్ గొర్రెకుంట, సాయంత్రం తన మోటార్ సైకిల్ పై పోచంమైదాన్ నుంచి గొర్రెకుంట కు వెళుతుండగా కాశిబుగ్గ దగ్గర డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా ఇతను మద్యం సేవించి ఉన్నాడు. వీరిపై బుధవారం కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేయగా, వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రెండు రోజుల జైల్ శిక్ష విధించారు. దీంతో వారిని పరకాల సబ్ జైల్ కు పంపించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు.

## గ్రానైట్ లారీలను అడ్డుకున్న బృందావన్ కాలనీవాసులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, 63వ డివిజన్ బాపూజీ నగర్ కూరగాయల మార్కెట్ పరిధిలో నూతనంగా ఏర్పడిన బృందావన్ కాలనీవాసులు బుధవారం గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఈ గ్రానైట్ క్వారీలను నడుపుతున్న నాలుగు క్వారీ యజమానుల మీద ప్రస్తుత కాజీపేట సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. గ్రానైట్ క్వారీ ఓనర్లు ఇష్టారాజ్యంగా గ్రానైట్ లోడ్ తో లారీలను కాలనీలో నడిపిస్తున్నారని, గతంలో కాజీపేట సీఐగా పనిచేసిన మహేందర్ రెడ్డి, రాజులకు పిటిషన్లు ఇవ్వగా, నాలుగు క్వారీల యజమానులు వచ్చి కాలనీవాసులను సమయం అడగగా కాలనీవాసులు ఒప్పుకోలేదన్నారు. అలాగే గతంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కు తెలియపరచగా ఆయన కాలనీకి వచ్చి అప్పటి స్థానిక సీఐ, ఏసీపీ, తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ మైనింగ్ ఏడీలను పిలిపించి గ్రానైట్ లారీలు పోకుండా ఆపివేయమని చెప్పించారు. అప్పుడు, క్వారీ యజమానులు ఆరు నెలల గడువు అడగగా 100 రూపాయల బాండ్ కాగితంపై నాలుగు క్వారీ యజమానుల సంతకం తీసుకొని ఆరు నెలల గడువు ఇచ్చామని తెలిపారన్నారు. గడువు ప్రకారం ముగ్గురు క్వారీ యజమానులు లారీలు బందు పెట్టారని, మరో క్వారీ యజమాని పల్లపు వెంకటస్వామి లారీలు నడుపుతూనే ఉన్నాడని మండిపడ్డారు. దీనిపై కాజీపేట సీఐ వెంటనే స్పందించి క్వారీ యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోగలరని తెలిపారన్నారు. లారీలను అడ్డుకుని, పిటిషన్ ఇచ్చిన వారిలో బృందావన్ కాలనీ అధ్యక్షుడరాలు బర్ల సరోజ, ప్రధాన కార్యదర్శి మద్దెల భనయ్య, ఉపేంద్ర, విజయ, ఉమా, కరుణ, సకిన, భారతమ్మ, పద్మ, రాజయ్య, జగదీశ్వర్, షాకీర్, వీరమల్లు, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ భాష కాలనీవాసులు ఉన్నారు.

# సామాజిక ఉద్యమకారుడు మల్లన్నను గెలిపించండి

## ఆచార్య కూరపాటి వెంకట నారాయణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుద్యోగిత, నీళ్లు, నియమాకాలు, నిధులు అనే నినాదాలతో మారుమోగిన తెలంగాణ ఉద్యమ సెంటిమెంటును ఉపయోగించుకొని, 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో దోపిడి చేసిన బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బొంద పెట్టవలసిన అవసరం ఉందని, తెలంగాణ సామాజిక ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం పూలే ఆశయ సాధన సమితి ఆద్వర్యంలో కేయూ, దూరవిద్య ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆచార్య కూరపాటి విచ్చేసి మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై, పదవిచ్యుతుడైన కేసీఆర్ బలపరిచిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో కూడా మట్టి కర్పించాలని నిరుద్యోగ యువకులను, ఉద్యమకారులకు విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే సామాజిక ఉద్యమ గొంతుక తీన్మార్ మల్లన్న కూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సామాజిక స్ఫృహను చాటాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ అధికారం ఇస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఇప్పటికే 36 వేల ఉద్యోగాలు భర్తీ చేసినారని , ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ కులగణన చేస్తామని హామీ ఇచ్చినట్టుగానే, రేవంత్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసిందని, దామాషా ప్రకారం రిజర్వేషన్స్ అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సీఎం రేవంత్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయించుకోవలసిన అవసరం ఈ రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ జిల్లా నాయకులు బిక్కు నాయక్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ వంగల సుధాకర్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రత్యేక నిఘా



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారుల గల రఘునాథపల్లి, నిడిగొండ, గోవర్ధనగిరి, కొమ్మల గ్రామాల మధ్యలో ఇటీవల తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో సిఐ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నేపథ్యంలో జనగామ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్ నేపథ్యంలో రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకై సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇటీవల మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద టిఫిన్ చేస్తున్న ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందడంతో పోలీసులు ప్రత్యేక దృష్టికి కేంద్రీకించారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి తో నిరంతరం తరచుగా వాహనాలను తనిఖీ చేస్తూ పలు పలు సూచనలు చేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ తో పాటు వాహనాలకు లైసెన్స్ లేని వారికి జరిమాన విధిస్తూ జైలుకు పంపిస్తున్నారు. లింగాల గణపురం, చిల్పూర్, రఘునాథ పెల్లి మండలాల పరిధిలోగల గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

## కాజీపేటలో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట 47వ డివిజన్ లో బీఆర్ఎస్ వరంగల్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి గెలుపు కోరుతూ పట్టభద్రులైన వారి ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అలాగే రెండు లక్షల ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేసిందని తెలిపారు. రేపు కౌన్సిల్ సమావేశాలలో పట్టభద్రులైన గ్రాడ్యుయేట్స్ కోసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాటం చేసే వ్యక్తి రాకేష్ రెడ్డి అని అన్నారు. అలాంటి రాకేష్ రెడ్డికి సీరియల్ నంబర్ 3 లోని బాక్స్ లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ అఫ్జల్, రామగిరి రామచందర్, గాజుల విజయ్, గబ్బెట కరుణ్, రామగిరి మనోజ్, బంగారు సతీష్, రజిని, సవిత, నితీష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

# పూసపల్లి కుట్ర కేసులో వెంకట్ రెడ్డి పేరును తొలిగించాలి

**ప్రశ్నించే గొంతుకలపై కుట్ర కేసులు సరికాదు**

**కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్**



**వరంగల్ వాయిస్, కేయూ :** గత మూడు నెలల క్రితం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నేతలపై పెట్టిన పూసపల్లి కుట్ర కేసులో భాగంగా నిన్న పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి పేరు చేర్చడం పట్ల పీడీఎస్ యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద బుధవారంనిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి పేరును పూసపల్లి కుట్ర కేసులో చేర్చడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ఇది ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడమేనని అన్నారు. గడిల పాలలను బద్దలు కొట్టి ప్రజల పాలనను తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్నదని వారన్నారు. నిరంతరం విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారనే కారణంగా ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే ఉద్దేశంతో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి పై అక్రమంగా పూసపెల్లి కుట్ర కేసు నమోదు చేయడం చాలా దుర్మార్గమని, మొగిలి వెంకట్ రెడ్డి పై పెట్టిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులుగా, విద్యార్థి సంఘ నాయకులుగా సమాజంలో ఉన్న సబ్బండ వర్గాలను ఏకం చేసి రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే గొంతుకలపై ఉక్కు పాదం మోపాలనే ఉద్దేశంతో ఉన్న పాలకవర్గాలు వారి బుద్ధిని మార్చుకోవాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ యూనివర్సిటీ ఉపాధ్యాయులు రాజు, నాయకులు నరసింహ, రత్నాకర్, వెంకట్, అజిత్, నరసింహ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వారంతా చిన్ననాటి స్నేహితులు... 30 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల, ఉర్సు కరీమాబాద్లో 1993-1994లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారికి చదువులు నేర్పిన గురువులను ముఖ్య అతిథులుగా పిలుచుకున్నారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకున్న మీరు ఉన్నత స్థాయికి ఎదగడం చాలా ఆనందంగా ఉందని, మిమ్మల్ని అంతా చూస్తుంటే మాకు గత స్మృతులు గుర్తుకొస్తున్నాయని తెలియజేస్తూ అందరికీ తమ ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం చాలా బాగా ఏర్పాటు చేశారని, ప్రతి సంవత్సరం ఇదే విధంగా కొనసాగిస్తూ మీరంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులందరూ ఒక్కొక్కరుగా వారిని పరిచయం చేసుకుంటూ వారి కుటుంబం గురించి స్నేహితులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. ఈ అపూర్వ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించిన తాళ్ల రాజేందర్, వనం శ్రీకాంత్, గుడిమల్ల రామారావు, కంచ తిరుపతి, కోరే నాగరాజు, బైరి నాగరాజు, ఎస్.నరేందర్, మచ్చ హరి, బొల్లెన మధు, గాడిపెల్లి సరిత, కోరే వెంకటలక్ష్మి, శోభారాణి, బైరు రామ చందరలతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**వరంగల్ వాయిస్, నడికూడ :** ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన నడికూడ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొట్ల శ్రీను-శృతిల కుమార్తె వైష్ణవి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి పరకాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి(చందు), ప్రధానకార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, నడికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కిర్గిస్థాన్ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కిర్గిస్థాన్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలపై భారతీయ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని వారిని భారత దేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా లతో మాట్లాడుతున్నానని, త్వరలోనే స్వదేశానికి వస్తారని జీవీకే ఎడ్యుటెక్ బృందానికి కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఇటీవల జరిగిన అల్లర్ల గురించి అడిగి తెలుసుకొని అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని జీవీకే ఎడ్యుటెక్ డైరెక్టర్ విద్య కుమార్ తెలిపారు. సలహాల కోసం భారత ప్రభుత్వం భారత రాయబార కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్ 0555710041 సంప్రదించగలరని సూచించారు.

## ఓటిటిలోకి అజయ్ దేవగణ్ .. మైదాన్



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మైదాన్ . ఇండియన్ లెజెండరీ ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు అమిత్ రవీంద్రనాథ్ శర్మ దర్శకత్వం వహించాడు.. జీ స్టూడియోస్ సంస్థ, బోనికపూర్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తూ.. ఎట్టకేలకు ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఇప్పుడు తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం రెంటల్ విధానంలో అందుబాటులోకి వచ్చింది. రూ.349కి ఈ సినిమాను ప్రైమ్ అందుబాటులో ఉంచింది. 1950-62 మధ్యకాలంలో ఫుట్‌బాల్ ఆటకు ఇండియాలో విపరీతమైన క్రేజ్ ఉండేది. అయితే ఫుట్‌బాల్ ఆటకు ఇంత ఆదరణ రావడానికి కారణం ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ. అతను కోచ్‌గా ఉన్నప్పుడే 1951, 1962లో భారత ఫుట్ బాల్ టీమ్ ఆసియా గేమ్స్ లో విజయం సాధించింది. ఇక అబ్దుల్ రహీమ్ కోచ్‌గా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాగా.. అబ్దుల్ రహీమ్ పాత్రలో అజయ్ దేవగణ్ నటించగా.. అతడి భార్య పాత్రలో ప్రియమణి నటించింది. ఇక ఈ సినిమాలో గజ్రాజ్ రావ్. రుద్రానిల్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

## స్వీటీతో సినిమా తీస్తా..

### నిర్మాత బషీద్

అనుష్క ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత ఎస్ కే బషీద్ తెలిపారు. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా 'అల్లరే అల్లరి' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఎస్ కే బషీద్.. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. తన కొత్త సినిమా విశేషాలను తాజాగా హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పు కొచ్చారు. అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో విజయేంద్రప్రసాద్ కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. ఆ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తానన్నారు.



## రొటీన్‌కు భిన్నంగా..

రొటీన్ సినిమాలకు భిన్నంగా తనకంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ విజయాలను అందుకుంటున్నాడు టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు. ఈ హీరో ప్రస్తుతం స్వాగ్ అనే సినిమాతో వస్తున్న విషయం తెలిసిందే. బోరింగ్ కథలకు టాటా చెబుతూ! సరికొత్త పంథాలో అచ్చ తెలుగు సినిమా అంటూ ఇప్పటికే గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఎగ్జైటింగ్ అప్‌డేట్‌లు త్వరలోనే ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహారిస్తుండగా.. ఈ సినిమాకు హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా.. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పెళ్లి చూపులు ఫేమ్ రీతూ వర్మ కథానాయికగా నటిస్తుంది. జూలై మొదటి వారంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురా నున్నారు.



## చీరకట్టులో జాన్వీ అదుర్స్



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనమిచ్చారు. కంచి పట్టు చీర కట్టిన ఆ ముద్దుగుమ్మ.. తన అందాలతో ఆకర్షిస్తోంది. బ్లూ కలర్ శారీ కట్టుకున్న జాన్వీ.. ఆ పట్టు చీరపై క్రికెట్ డిజైన్ వేసుకున్నది. మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ ఫిల్మ్ కోసం వారణాసిలో ప్రమోషన్ చేస్తున్న ధడక్ గర్ల్.. చాలా వెరైటీ శారీలో తళుక్కుమన్నది. గంగా నది తీరంలో పడవపై వెళ్తూ ఆమె తన చీరలో దాగిన డిజైన్ వర్క్‌ను ప్రజెంట్ చేసింది. బ్లూ కలర్ చీరపై చేయితో నేసిన డిజైన్ వర్క్ ఆకట్టుకంటోంది. 1983 వరల్డ్ కప్ గెలిచిన సందర్భానికి చెందిన క్షణాలను ఆ చీరపై అత్యంత కళాత్మకంగా డిజైన్ చేశారు. మిరుమిట్లు గోలిపే స్టేడియంలో ఓ బ్యాటర్ భారీ సిక్స్ కొట్టినట్లు ఆ చీర డిజైన్‌లో చూపించారు. క్రికెటర్లు పవర్‌ఫుల్ షాట్లు ఆడుతున్నట్లు కూడా డిజైన్‌లో క్రియేట్ చేశారు. షార్ట్ స్లీవ్ బ్లౌజ్ వేసుకున్న జాన్వీ.. బ్యాక్‌లెస్ టై నాట్‌తో సంప్రదాయబద్ధంగా కనిపించింది. క్రికెట్ స్టోరీ నేపథ్యం ఉన్న చిత్రంలో నటిస్తున జాన్వీ.. ఆ కాన్సెప్ట్‌తో డిజైన్ చేసిన చీరలో తన ఫ్యాషన్ ట్యాలెంట్‌ను ప్రదర్శించింది.

# నాంచారమ్మ జాతరకు వేళాయే..



## రేపు రామానుజాపురంలో జాతర

## కాకతీయుల కాలంలో రామప్ప గుడితో పాటు ఆలయ నిర్మాణం

## నాలుగు రాష్ట్రాల నుంచి రానున్న ఎరుకల కులస్తులు

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ఎనిమిది వందల సంవత్సరాల క్రితం తెలుగు మాట్లాడే ప్రజలందరినీ ఏకం చేసి పరిపాలించిన కాకతీయ రాజుల కాలంలో రామప్ప దేవాలయంతో పాటు అద్భుత శిల్ప సంపదతో నిర్మించబడింది ఎరుకల నాంచారమ్మ ఆలయం. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ సమీపంలోని పచ్చని పంట పొలాల మధ్య నిర్మించిన నాంచారమ్మ ఆలయం (పంచకూటాలయం) కాలక్రమంలో పూజలకు నోచుకోక





నిరాదరణకు గురైంది. పురావస్తు శాఖ అధికారులు అభివృద్ధి పేరుతో పునర్నిర్మాణం చేస్తామని ఆలయాన్ని విప్పి కుప్ప పెట్టారు. సమీపంలోని చెంచు కాలనీ అటవీ ప్రాంతంలో కొన్ని శిల్పాలు, మరికొన్ని రామానుజాపూర్ గ్రామ శివారులో చిందరవందరగా పడేశారు. ఎంతో విశిష్టత కలిగిన ఆలయం వద్ద తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి ఏటా వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు.

### వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున జాతర..

ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున ఎరుకల నాంచారమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. 2018లో మొదటిసారి జాతర నిర్వహించగా ఈసారి మే 23న జాతర నిర్వహించనున్నారు. దేవుళ్ళకి ఎరుక చెప్పిన ఘన చరిత్ర కలిగిన నాంచారమ్మను దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్ రాష్ట్రాల నుంచి ఎరుకల కులస్తులు భారీగా తరలిరానున్నారు. జాతర మొదటి రోజు లక్ష్మీదేవి పేట గ్రామం నుంచి ఎరుకల కులస్తులు సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారాల ప్రకారం డప్పు చప్పుళ్ళ మధ్య నైవేద్యం తీసుకువస్తారు. రామానుజాపూర్ గ్రామంలో కోలాటాలు, వివిధ వేషధారణలతో ఉన్న ఎరుకల కులస్తులు తమ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తారు. లిపిలేని వీరి భాష ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. నాంచారమ్మకు మొక్కులు చెల్లించిన తర్వాత నాంచారమ్మ వేషధారణతో ఉన్న ఎరుకల యువతులు, మహిళలు, వృద్ధుల వద్ద ఆసక్తి ఉన్నవారు సోది చెప్పించుకుంటారు. యువకులు ఏకలవ్యుని వేషధారణలో కనిపిస్తారు. ఐదు రోజులపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే స్థానిక భక్తులు నాంచారమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తిరుగువారం రోజు ఎరుకల కులస్తులు నాంచారమ్మకు ప్రత్యేక మొక్కులు చెల్లించడంతో జాతర ముగుస్తుంది.

### సౌకర్యాలు కల్పించేనా..

ఎనిమిది సంవత్సరాలుగా జాతర జరుగుతుండగా ప్రతిసారి జాతరకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు ప్రతిసారి నిర్లక్ష్యం చూపుతున్నారు. వేసవి కాలం కావడంతో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు వైద్య సౌకర్యం కల్పించేలా అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్రధాన రహదారి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంచారమ్మ జాతరకు జిల్లా కలెక్టర్ రోడ్డు సౌకర్యం కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపారు. ఆలయానికి చెందిన భూమి కొంత అన్యాయక్రాంతం కాగా భూమిని రక్షించి చుట్టూ ప్రహరీ నిర్మించేలా అధికారులు చొరవ చూపాల్సి ఉంది. ప్రతి ఏటా జరిగే జాతరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

# ఆలోచించండి.. రాకేష్ రెడ్డికి అండగా నిలువండి

**అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్**

**నమ్మి మోసపోయిప జనం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతు బిడ్డ, చదువుకున్న యువకుడు, ప్రశ్నించే గొంతుక, పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి అండగా నిలువండి..అభివృద్ధికి బాటలు వేయండని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నర్సంపేట, వరంగల్ తూర్పు, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, ధాస్యం వినయ్ భాస్కర్ ల అధ్యక్షన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ మాట్లాడుతూ యువత గొంతుక కానున్న రాకేశ్ రెడ్డి బీఆర్ ఎస్ వైపు పోటీలో ఉంటే మహిళల మెడలో తాళిబొట్టు కొట్టేసే అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నాడని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించి.. అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో విద్యుత్ కోతలు మొదలైనవన్నారు. నిన్న ఎంజీఎం ఆసుపత్రిలో ఐదు గంటలు విద్యుత్ నిలిపోయిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ కాలే.. రైతు బంధు రైతులకు రాలే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ ఇవ్వాలే..వరికి రూ.500 బోనస్ దక్కలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మోసాల పరంపర సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పచ్చి మోసగాళ్లని దుయ్యబట్టారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక కావాలంటే..రాకేష్ రెడ్డిని గెలిపించాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. కొత్త పరిశ్రమలను తీసుకువచ్చే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. ఉన్న కంపెనీలను కపాడుకునే సత్తా లేని నాయకులు ఆ పార్టీ నాయకులన్నారు. తీన్మార్ మల్లన్న లాంటి వారు గెలిస్తే చట్టసభలు బూతు మాటలకు వేదిక అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బ్లాక్ మెయిలర్‌ను గెలిపిద్దామా..: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

బిట్స్ పిలానీలో డిగ్రీ పట్టా పొంది గోల్డ్ మెడల్ సాధించి, అమెరికాలో ఏడు సంవత్సరాలు ఉద్యోగం చేసిన ఉన్నత విద్యావంతుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి గారిని గెలిపిద్దామా.. లేక బ్లాక్ మెయిలర్, 50 క్రిమినల్ కేసులున్న మల్లన్నని గెలిపిద్దామా? అని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్ మహాశయులు ఆలోచించాలని కోరారు. మీ అమూల్యమైన ఓటుని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి 'ఏనుగుల రాకేష్ రెడ్డి'కి వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో ఉద్యోగుల సమస్యలను, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే దమ్మున్న రాకేష్ రెడ్డి లాంటి నాయకుడు ఉండాలన్నారు.



ఇంటలెక్చువల్స్ ఫోరం - ఉమ్మడి వరంగల్ జిల్లా

ఆధ్వర్యంలో

రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

వేదిక: ప్రెస్ క్లబ్, హనుమకొండ తేది: 24.05.2024

సమయము ఉ. 10.00 గం. ల నుండి మ. 2.00 గం. ల వరకు

సభాధ్యక్షులు: ప్రొఫెసర్ యం. ఎర్రగట్టు స్వామి, కన్వీనర్

వక్త: బొజ్జా భిక్షమయ్య, సామాజిక విశ్లేషకులు

అంశం: "రాజ్యాంగ పరిరక్షణలో ప్రజా ప్రతినిధుల పాత్ర"

ముఖ్య అతిథి: నాయిని రాజేందర్ రెడ్డి, MLA వరంగల్ పశ్చిమ

గౌరవ అతిథులు:

అలుగుబెల్లి నర్సిరెడ్డి, MLC

ప్రొఫెసర్ కోదండ రామ్, తెలంగాణ ఉద్యమకారుడు

ప్రొఫెసర్ కే. వెంకట్ నారాయణ, సామాజిక ఆర్థికవేత్త

జనాబ్ ఖుస్రు పాషా సాహెబ్, చైర్మన్ హజ్ కమిటీ , తెలంగాణ

డా. మహమ్మద్ రియాజ్ , గ్రంధాలయ సంస్థ చైర్మన్, తెలంగాణ

డా. ప్రీతి దయాల్, సామాజిక ఉద్యమకారిణి

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com